

ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సిఐటియు నేత జి.రాజు

ప్రజాశక్తి - ముసునూరు

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు అన్నారు. బుధవారం స్థానిక పిహెచ్‌సి వైద్యులు కిరణ్‌కు 16 గ్రామాల ఆశా వర్కర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆశాలపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు

నేడు ఎంఎల్‌సి కౌంటింగ్

ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం

ఐదు టేబుళ్లు ఏర్పాటు : లెక్కించాల్సిన ఓట్లు 1,088

బరిలో ఆరుగురు అభ్యర్థులు

మధ్యాహ్నానికి లెక్కింపు పూర్తయ్యే అవకాశం

స్వపక్ష ప్రజాప్రతినిధులకే డబ్బు పంపిణీపై సర్వత్రా చర్చ

ఓట్ల చీలికపై లోలోన వీడని టెన్షన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కానుంది. ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉదయం ఏడు గంటలకు ఎన్నికల పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ తెరిచి అనంతరం లెక్కింపు ప్రక్రియను ప్రారంభిస్తారు. మొత్తం ఐదు టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొదట కౌంటింగ్ టేబుళ్ల వద్ద, తదుపరి రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద లెక్కింపు ప్రక్రియ జరుగనుంది. ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తం 1,105 ఓట్లకుగాను ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో 1,088 ఓట్లు పోలయ్యాయి. ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రాధాన్యతా ఓటు ఆధారంగా సాగనుంది. మొదటి ప్రాధాన్యతా ఓట్లను ముందుగా పక్కన పెడతారు. తర్వాత రెండో ప్రాధాన్యత ఓటు, తర్వాత మూడో ప్రాధాన్యత ఇలా వేరు చేసి కట్టలు కట్టి ఓట్ల లెక్కింపు సాగిస్తారు. పోలైన ఓట్లలో 50 శాతం అంటే 545 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలిచినట్లుగా ప్రకటిస్తారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లు 50 శాతం దాటకపోతే రెండో ప్రాధాన్యత ఓటును లెక్కించి గెలుపును ప్రకటిస్తారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం ఓట్లు 1,105కుగాను దాదాపు 920 మంది వైసిపి స్థానిక ప్రజాప్రతినిధులే ఉన్నారు. 185 మంది టిడిపి, జనసేన, స్వతంత్రులు ఉన్నారు. మొత్తం ఓట్లలో 17 ఓట్లు పోలు కాలేదు. దీనిలో బుట్టాయగూడెం, వేలేరుపాడులోని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీకి చెందిన నలుగురు స్థానిక ప్రజాప్రతినిధులు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. మిగిలిన 13 మంది వైసిపికి చెందిన వారే ఎక్కువ ఉన్నారు. పోలైన ఓట్ల ప్రకారం చూస్తే వైసిపి అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ సునాయాసంగా గెలిచే పరిస్థితి ఉంది. గెలుపుపోటముల సంగతి పక్కన పెడితే క్రాస్ ఓటింగ్‌పై మాత్రం వైసిపిలో తీవ్రమైన చర్చ నడుస్తోంది.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు

సొంత ప్రజాప్రతినిధులకే డబ్బు పంపిణీ దేనికి సంకేతం!

జిల్లాలోని స్థానిక సంస్థలకు చెందిన రెండు ఎంఎల్‌సి స్థానాలు వైసిపికి ఏకగ్రీవంగా దక్కాలి. అయితే టిడిపికి చెందిన నలుగురు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. వీరిలో వీరవల్లి చంద్రశేఖర్‌కు టిడిపి అధికారికంగా మద్దతు ప్రకటించడంతో ప్రధాన పోటీదారుగా నిలిచారు. సర్పంచుల ఛాంబర్ సైతం టిడిపి మద్దతు పలికిన చంద్రశేఖర్‌కు మద్దతు పలికింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు 185 మందితోపాటు అధికార పార్టీకి చెందిన మరో 150 నుంచి 200 ఓట్లు చీలితే ప్రతిపక్షాలు బలపర్చిన అభ్యర్థి గెలిచే అవకాశం ఉంటుంది. ప్రభుత్వంపై వైసిపి స్థానిక ప్రజాప్రతినిధులు సైతం తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. స్థానిక సంస్థలకు నిధులివ్వకపోవడం, కాంట్రాక్టులు చేసిన బిల్లులు ఇవ్వకపోవడం వంటి అనేక కారణాలు ఉన్నాయి. దీంతో ఎంఎల్‌సి ఎన్నికలు ఉత్కంఠ రేపాయి. ఓటుకు నోటు ఇస్తేనే వైసిపి అభ్యర్థులకు ఓటు వేస్తామని ఆ పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులే తేల్చిచెప్పినట్లు తెలిసింది. దీంతో వైసిపి నాయకుల్లో భయం పట్టుకుంది. బలం ఉండి ఓడిపోతే రాజకీయంగా ఎదురుదెబ్బ తప్పదని ఆందోళన గురైన పరిస్థితి ఏర్పడింది. ఓటమి భయంతో సొంత వైసిపి ప్రజాప్రతినిధులకే ఓటుకు రూ.20 వేలు చొప్పున పంపిణీ చేయాల్సి వచ్చింది. సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకే డబ్బు పంపిణీ చేయడం దేనికి సంకేతమనే చర్చ నడుస్తోంది. ప్రతిపక్ష, స్వతంత్ర స్థానిక ప్రజాప్రతినిధులకు కూడా పలుచోట్ల అధికార పార్టీ డబ్బు ఇచ్చిన పరిస్థితి ఉంది. అయినప్పటికీ వైసిపి నాయకుల్లో క్రాస్ ఓటింగ్ టెన్షన్ మాత్రం వీడలేదు. మొదటి ప్రాధాన్యతా ఓటు వైసిపి అభ్యర్థికి వేసి రెండో ప్రాధాన్యతా ఓటు టిడిపి బలపరిచిన అభ్యర్థికి వేస్తే పరిస్థితి ఏమిటనే భయం వెంటాడుతోంది. వైసిపి అభ్యర్థుల గెలుపుపై ఎటువంటి అనుమానాలు లేకపోయినప్పటికీ ఓట్ల చీలికపై ఆందోళన మాత్రం వైసిపిని వెంటాడుతోంది.


ఏర్పాట్లన్నీ పూర్తి

పి.అరుణ్‌బాబు, రిటర్నింగ్ అధికారి

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. ఉదయం 7 గంటలకు ఎన్నికల పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ తెరిచి 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తాం. లెక్కింపు ప్రక్రియపై ఎన్నికల సంఘం నిబంధనలపై ఇప్పటికే సిబ్బందికి రెండుసార్లు శిక్షణ ఇచ్చాం. కౌంటింగ్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

'సింజెంటా' బాధిత రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి - ముసునూరు



వినతిని అందిస్తున్న నాయకులు, రైతులు

సింజెంటా మొక్కజొన్న కంపెనీ బాధిత రైతులకు తక్షణం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహ అన్నారు. బుధవారం మండలంలోని కాట్రేనిపాడు రెవెన్యూ పరిధిలో సుమారు 230 ఎకరాల్లో సింజెంటా మొక్కజొన్న విత్తనం నాటగా అవి పూర్తిస్థాయిలో గింజలు రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయం తెలిసి రైతుసంఘం నేతలు బుధవారం ఆ మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సింజెంటా మొక్కజొన్న కంపెనీ ఎకరానికి మూడున్నర టన్నుల నుంచి ఐదు టన్నుల వరకూ దిగుబడి వస్తుందని ఆశ చూపి విత్తనాలిచ్చారని తెలిపారు. కౌలు కాకుండానే ఎకరానికి సుమారు రూ.60 నుంచి రూ.70 వేలు వరకూ పెట్టుబడి పెట్టామన్నారు. ప్రస్తుతం విరుపుడు దశలో ఒకటిన్నర నుండి రెండు టన్నులు మాత్రమే దిగుబడి రావడంతో కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొందని వాపోయారు. దీనిపై రైతులంతా కలిసి రైతుసంఘం ఆధ్వర్యాన కాట్రేనిపాడులో ధర్నా నిర్వహించారు. అనంతరం మండల కేంద్రం ముసునూరు చేరుకుని మండల వ్యవసాయాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. సింజెంటా కంపెనీ, సీడ్ ఆర్గనైజర్లతో మాట్లాడి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు పిల్లి మురళీ, రైతులు సొంగా రమేష్, సొంగా అశోక్‌బాబు, సొంగా యోబు, గద్దల రంగారావు, కలపాల నెహ్రూ, డి.పండు, సొంగా ప్రకాశరావు, జి.విజయ్‌కుమార్, జి.బక్కయ్య, సొంగా నాగేశ్వరరావు, సొంగా ఆనందరావు, సొంగా జయరాజు, ఎస్.రాజు కోరారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

పెదవేగి: దిగుబడి రాక నష్టపోతున్న సీడ్, కమర్షియల్ మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పెదవేగి, కూచింపూడి గ్రామాల్లో బుధవారం ఆ సంఘం నేతలు పర్యటించి సీడ్, కమర్షియల్ మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంట దిగుబడి, పెట్టుబడి ఖర్చుల వివరాలను రైతులను అడిగి సేకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సీడ్, కమర్షియల్ మొక్కజొన్న పంట రైతుల చేతికొచ్చిందని చెప్పారు. గతేడాది కంటే ఈ సంవత్సరం వాతావరణ మార్పులు, తెగుళ్లు, ఇతర కారణాలతో దిగుబడులు తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలతో ఎకరా మొక్కజొన్న సాగుకు రూ.50 వేలు వరకు పెట్టుబడి ఖర్చవుతుందని అన్నారు. ఎకరా కౌలు రూ.30 వేలకుపైగా ఉందన్నారు. కౌలుతో కలుపుకుని ఎకరాకు రూ.80 వేలకుపైగానే పెట్టుబడి అవుతుందని చెప్పారు. దిగుబడి మాత్రం మూడు టన్నులకు మించి రావడం లేదన్నారు. సీడ్ కంపెనీలు టన్నుకు రూ.25 వేలు ఇస్తున్నాయని, ఫలితంగా మొక్కజొన్న కౌలురైతులు నష్టపోతున్నారని తెలిపారు. సీడ్ కంపెనీలు రైతులను మోసగించకుండా పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కమర్షియల్ మొక్కజొన్న సాగు రైతులు కూడా నష్టపోతున్నారని చెప్పారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తెరిచి మద్దతు ధరకు అదనంగా ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, పలువురు మొక్కజొన్న రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వరి

శాశ్వత లోక్‌అదాలత్ సేవలు వినియోగించుకోండి


ప్రజాశక్తి - ఏలూరు

పెండింగ్ కేసుల రాజీకి శాశ్వత లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని శాశ్వాత ప్రజాసమస్యల న్యాయ పీఠం చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో మేరీ గ్రేస్ కుమారి, జి.రాజేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం పాలగూడెం సచివాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్‌కుమారి మాట్లాడుతూ త్వరితగతిన కేసుల రాజీ చేయడానికి లీగల్ సర్వీస్ అథారిటీ వారు కృషి చేస్తున్నారని, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీ చేసుకోవడానికి లీగల్ సర్వీస్ అథారిటీ వారిని సంప్రదించవచ్చని సూచించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నూతనంగా శాశ్విత లోక్‌అదాలత్ ఏర్పాటు చేశామన్నారు. రవాణా సేవలు, టెలిఫోన్, విద్యుత్, పారిశుధ్యం, ఆసుపత్రులు, బీమా సేవలపై, ఎన్ఆర్ఇజిఎస్ బకాయిలపై, బ్యాంకు లావాదేవీలపైనే. విద్యా విషయాలపైన, రియల్ ఎస్టేట్ విభాగాల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా శాశ్వత లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. జి.రాజేశ్వరి మాట్లాడుతూ క్రిమినల్ కేసుల్లో అరెస్టుకు ముందుగా కూడా ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని, ఈనెల 18వ తేదీన ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కుటుంబ వివాదాలు వినియోగదారుల ఫోరానికి సంబంధించిన, ఐపిఆర్ కేసులపై ప్రత్యేక లోక్‌అదాలతో నిర్వహిస్తున్నారని, కక్షిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సునీత, ఉప సర్పంచి తూతా నిరంజన్, ఏలూరు డిప్యూటీ తహశీల్దార్ చలపతిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీట్ పీజీ ఎంట్రెన్స్‌లో ప్రదీప్‌చంద్రకు 389వ ర్యాంకు

అభినందించిన మానస హైస్కూల్ కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్

ప్రజాశక్తి - భీమడోలు



ప్రదీప్‌చంద్ర

గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక, హైస్కూల్ విద్యాభ్యాసం చేసి ప్రస్తుతం జాతీయస్థాయిలో నీట్ పీజీ ఎంట్రెన్స్ టెస్టు-23లో మండలంలోని కురెళ్లగూడెం గ్రామానికి చెందిన కానుమిల్లి ప్రదీప్‌చంద్ర 389 ర్యాంకు సాధించడం అభినందనీయమని, ఆయన తమ పాఠశాల పూర్వ విద్యార్థి కావడం గర్వకారణంగా ఉందని భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ తెలిపారు. ప్రదీప్ చంద్ర ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకు భీమడోలు మానస హైస్కూల్లో చదివారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించారు. ఇంటర్ అనంతరం ఎంసెట్ ర్యాంక్ ఆధారంగా సిద్దిపేట ఆర్‌విఎం మెడికల్ కాలేజీలో ఉచిత సీటు సాధించారు. అనంతరం నీట్ పీజీ ఎంట్రన్స్-23 జాతీయస్థాయి ప్రవేశ పరీక్షల్లో 389వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా మానస పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ సాధారణంగా పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను దూర ప్రాంతంలో గల ప్రయివేటు పాఠశాలలో అత్యధిక ఫీజులు చెల్లించి చదివిస్తే ఉన్నత స్థానాలకు ఎదుగుతారనే అపోహలో ఉంటారన్నారు. వీటన్నిటికీ భిన్నంగా తమ పాఠశాలను వ్యాపార సంస్థగా కాక విద్యాసంస్థగా నిర్వహిస్తున్నామన్నారు. తమ పూర్వ విద్యార్థి ప్రదీప్ చంద్ర సాధించిన ఘనతతో పలువురు తల్లిదండ్రుల అపోహలను తొలగిపోతాయని అభిప్రాయపడ్డారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు రత్నాచౌదరి, భానుమంగశ్రీ, రాజా సాయేంద్ర వంటి పలువురు విద్యాపరంగా ఉన్నత స్థానాలు సాధించారని వివరించారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌తోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రదీప్ చంద్రను అభినందించారు. ఆయన ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - చింతలపూడి

2023-24 విద్యా సంవత్సరంలో అంబేద్కర్ గురుకుల పాఠాశాలలో ఐదో తరగతిలో చేరేందుకు నిర్వహిస్తున్న ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఇతర అధికారులు

ఆడపిల్లను పుట్టనిద్దాం.. రక్షిద్దాం.. చదివిద్దాం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఆడ పిల్లల జనన నిష్పత్తిని పెంచడం, విద్యను ప్రోత్సహించడం ద్వారా ఆదర్శ జిల్లాగా నిలపాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మహిళా శిశుసంక్షేమశాఖ, మిషన్ శక్తి ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమ వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం మన జిల్లాకు ఈ సంవత్సరం అమల్లోకి వచ్చిందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాల్టీ పరిధిలో జనన, మరణాల నమోదును రిజిష్టరులో పొందుపర్చుతున్నారని, దీని ఆధారంగా ప్రతినెలా ఈ డేటాను సేకరించి దీన్నిబట్టి ఆడపిలల నిష్పత్తి ఎక్కడ తక్కువగా ఉందో గుర్తించవచ్చని అన్నారు. స్కానింగ్ సెంటర్లలో అబార్షన్ చేసే డాక్టర్లను గుర్తించాలని, వారిపై చట్టప్రకారం కమిటీ చర్యలు తీసుకోవాలని అన్నారు. స్కూళ్లు, కాలేజీల్లోనూ బాలికల డ్రాప్‌వుట్స్ లేకుండా చూడాలన్నారు. బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు ప్రతి పాఠశాలలోను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేడు ఆడ పిల్లలను పుట్టనిద్దాం-ఆడ పిల్లలను రక్షిద్దాం-ఆడ పిల్లలను చదివిద్దాం అనే సందేశాన్ని జిల్లావ్యాప్తంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఆడపిల్లను పుట్టనిద్ధాం-ఆడపిల్లను రక్షిద్దాం-చదివిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు. మిషన్ శక్తి ప్రోగ్రాం పరిపాలనాధికారి నిర్మల మాట్లాడుతూ ఉజ్వల స్కీమ్, వన్‌స్టాప్ సెంటర్, వీడియో కాన్ఫరెన్స్, నారీ అదాలత్, శక్తిసదన్, విడోస్ తదితర అంశాలపై వివరిం చారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశా, డిఇఒ రవిసాగర్, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఏలూరు కార్పొరేషన్ కమిష నర్ ఎస్.వెంకటకృష్ణ, డిపిఒ మల్లికార్జునరావు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, డిసిపిఒ సూర్యచక్రవేణి, కాలేజీ ప్రిన్సిపాల్స్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇంటర్ తొలిరోజు పరీక్షలు ప్రశాంతం

95 శాతం మంది హాజరు -ముదినేపల్లిలో ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులు - అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఆర్ఐఒ ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ పరీక్షల్లో తొలిరోజు తెలుగు, హిందీ, ఉర్దూ, సంబంధించి 35,007 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 33,427 మంది హాజరయ్యారు. మిగిలిన 1,580 మంది గైర్హాజరయ్యారు. 95 శాతం మంది హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 106 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో తాగునీటి వసతి, సీటింగ్, లైటింగ్‌తోపాటు అత్యవసర వైద్య సేవలందించే విధంగా ఎఎన్ఎం, ఆశావర్కర్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్లను, డిపార్టుమెంటల్ అధికారులను ఏర్పాటు చేశారు. జిల్లాలో నాలుగు సిట్టింగ్, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసేందుకు నియమించారు. ఎక్కడా మాస్‌కాపీకి తావులేకుండా పటిష్ట భద్రతను చేపట్టారు. ఏలూరు నగరంలో ఉన్న ఎన్ఆర్ఐ, చైతన్య, కోటదిబ్బ జూనియర్ కళాశాల ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

ముదినేపల్లి : ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ మొదటి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 237 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 21 మంది గైర్హాజరైనట్లు డిపార్టుమెంటల్ ఆఫీసర్ రాంబాబు తెలిపారు.



ముదినేపల్లిలో..

ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులు.. పరీక్షకు నిరాకరణ

పరీక్షకు ఆలస్యంగా రావడంతో ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. ఉదయం 9 గంటలు దాటిన తర్వాత వచ్చిన విద్యార్థులను గేటు వద్ద నిలిపివేశారు. ఆ విద్యార్థులు ప్రాధేయపడినా సమయం దాటిపోవడంతో అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో చేసేదిలేక ఆ విద్యార్థులు వెనుదిరిగారు.



ఏలూరులో..

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలిరోజు బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి పి.ఏలేసుబాబు శారీరక వైకల్యంతో బాధపడుతున్నాడు. చేతులతో పరీక్ష రాయలేని పరిస్థితి. ఈ క్రమంలో ఆ విద్యార్థికి సహాయకుడు పరీక్ష రాసేందుకు విద్యాశాఖ అధికారులు అనుమతిచ్చారు. దీంతో ఆ విద్యార్థి సహాయకుడి సహకారంతో పరీక్ష రాశాడు.

భీమడోలు: మండలంలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. జూనియర్ ఇంటర్ విద్యార్థులు తెలుగు/సంస్కృతం పరీక్షలు రాశారు. మండలానికి కేటాయించిన రెండు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో 172 మంది విద్యార్థులకు గాను 17 మంది గైర్హాజరయ్యారు. పొలసానిపల్లి బాలయోగి గురుకుల బాలికల పరీక్షా కేంద్రంలో 210 మందికి గాను 13 మంది పరీక్షలకు హాజరు కాలేదని ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు.

జీలుగుమిల్లి : మండలంలో ఇంటర్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 170 మందికి గాను 140 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ అలీ మొహిద్దిన్ తెలిపారు. 30 మంది గైర్హాజరయ్యారన్నారు.

గణపవరం : ఇంటర్ పరీక్షలు గణపవరం జూనియర్ కాలేజీలో ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 286 మంది విద్యార్థులకు 18 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపల్ ఎం.రఘు తెలిపారు. వసతులను ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి పర్యవేక్షించారు.

నూజివీడు : పట్టణంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ఎంప్లాయీస్ కాలనీలోని శ్రీమడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాగ్దేవి కళాశాల, శ్రీశారద కళాశాల, సెయింట్ ఆన్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్, పట్టణ సిఐ మూర్తి ఆదేశంతో ఎస్ఐ శివన్నారాయణ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం : ఇంటర్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ఏడు పరీక్షా కేంద్రాలో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల గుర్తింపులో ఆలస్యం కావడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. పోలవరం మండలం నుంచి ప్రయివేటు విద్యార్థులు కొందరు పరీక్షా కేంద్రాలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా చేరినట్లు సమాచారం. పరీక్షలకు 2647 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2467 మంది హాజరయ్యారు. 180 మంది గైర్హాజరయ్యారని కస్టోడియన్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ సాగర్‌బాబు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు శ్రీనాగలక్ష్మి

నాణ్యమైన సరుకులనే అడగండి

వినియోగదారుల ప్రయోజనాలకు రక్షణ కల్పించాల్సిందే

డిఎస్ఒ సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - ఏలూరు

వినియోగదారుని ప్రయోజనాన్ని పరిరక్షించి, ఉన్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉత్పత్తును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పించిన చట్టాల పట్ల కనీస అవగాహన కలిగి ఉండటం అందరి బాధ్యతని జిల్లా పౌర సరఫరాల అధికారి సత్యనారాయణరాజు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు వి.శ్రీనాగలక్ష్మి, జిల్లా వినియోగదారుల సంఘం ప్రతినిధులు కట్టా సత్యనారాయణ, కె.రామచంద్రరావు, డాక్టర్ విజయకష్ణ తదితరులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డిఎస్ఒ ఆర్ఎస్ఎస్.సత్యనారాయణరాజు మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడంలో పౌర సరఫరాల శాఖ ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటుందన్నారు. వి.శ్రీనాగలక్ష్మి మాట్లాడుతూ వస్తువుల నాణ్యత ఇతర వివరాలను తెలుసుకునే హక్కు ప్రతి వినియోగదారుడికీ ఉందన్నారు. వార్షిక ఆదాయం తక్కువున్న వారు విద్యా అడ్వాన్స్ తీసుకున్న సమయంలో వడ్డీ రాయితీ గురించి ముందస్తుగా బ్యాంకర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. కట్టా సత్యనారాయణ, కె.రామచంద్రరావు, డాక్టర్ విజయకృష్ణ తదితరులు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టంలోని పలు అంశాలను వివరించారు. వినియోగదారుల వివాదాల పరిష్కార వేదికలను ఆశ్రయించి సత్వర న్యాయం పొందవచ్చన్నారు. ప్రశ్నిస్తేనే సమాధానం దొరుకుతుందన్నారు. తూనికలు కొలతలు శాఖ డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాద్, వాణిజ్య పన్నుల శాఖ డిసిటిఒ జె.శ్రీనివాసరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డి.సునీత, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ కె.రామరాజు, ఎపిఇపిడిసిఎల్ డిఇ ప్రసాద్, తదితరులు వినియోగదారుల పరిరక్షణకు సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మంజుభార్గవి, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కె.వెంకటేశ్వరరావు, ఎల్‌డిఎం ఎస్ఎస్ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి బి.బెన్నీ పాల్గొన్నారు.


మరమ్మతులు పూర్తయిన గేటు

భీమడోలు రైల్వేగేటు వద్ద మరమ్మతులు పూర్తి

ప్రజాశక్తి - భీమడోలు


జాతీయ రహదారి నుంచి భీమడోలు గ్రామంలోకి ప్రవేశించే రోడ్డుపై ఉన్న 361 నెంబరు రైల్వే గేటు సమీపంలో మరమ్మతు పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈనెల 13వ తేదీ ఉదయం నుంచి ఈ పనులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి రాకపోకలు నిలిపివేశారు. పనులు పూర్తికావడంతో బుధవారం ఉదయం నుంచి రైల్వేగేట్ మీదుగా రాకపోకలకు అనుమతించారు.


హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, అధికారులు

చినవెంకన్నకు రూ.1.83 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్నకు యాత్రికుల విరాళాల ద్వారా రూ.1,83,76,847 ఆదాయం లభించినట్లు ఆలయ ఇఒ వేండ్ర త్రినాధరావు తెలిపారు. హుండీలను బుధవారం ఉదయం పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య లెక్కించారు. 22 రోజులకు గాను జరిగిన ఈ లెక్కింపులో నగదు రూపేణా పైన పేర్కొన్న నగదు, బంగారం 266 గ్రాములు, వెండి ఐదు కిలోల 518 గ్రాములు, పాత రూ.500 నోట్లు 105, రూ.వెయ్యి నోట్లు రెండు, విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఇఒ తెలిపారు.


మందులు అందిస్తున్న సర్పంచి

'ఆశ్రం' ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం తోటబడి ఆవరణలో ఆశ్రం ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ క్యాంపును గ్రామ సర్పంచి సలగల గోపీ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ వైద్యులు, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధుల నిపుణులు, ప్రసూతి, కంటి వైద్యులు సేవలందించారు. అవసరమైన వారికి ఆపరేషన్లు ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేసేలా చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనం తింటున్న జెడ్‌పిటిసి సభ్యులు, అధికారులు

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి


ప్రజాశక్తి - ముసునూరు

మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు జరగకుండా చూడాలని ముసునూరు జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ అన్నారు. బుధవారం ముసునూరు గురుకుల పాఠశాలలో ఎంఇఒ రత్నకుమార్, ఎంపిడిఒ జి.రాణీతో కలిసి జెడ్‌పిటిసి సభ్యులు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో గోరుముద్ద కార్యక్రమం ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో రాజీపడొద్దని సూచించారు. ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బోధనా సిబ్బంది తక్కువగా ఉండటంతో సిలబస్ పూర్తిచేయడం కష్టమవుతుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదుర్రులో తాగునీటి సమస్యను సత్వరం పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ కోరారు. బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను కలిసి తాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామస్తులు నీటిని కొనుక్కోవాల్సి వస్తుందని తెలిపారు. పంచాయతీ పాలకవర్గం ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కుళాయిల ద్వారా సరఫరా చేసే నీరు తాగేందుకు, వాడుకునేందుకు వీలుగా సురక్షితంగా ఉండాలని కోరారు.


వినతిని అందిస్తున్న చిన్నం మాధవ

క్షయపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ఆరోగ్యశాలలో క్షయపై ఆరోగ్య సిబ్బందికి వైద్యాధికారులు పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి అవగాహన కల్పించారు. 15 రోజులు జ్వరం, దగ్గుతో పాటు కఫం పడటం, బరువు తగ్గడం వంటి లక్షణాలుంటే క్షయ పరీక్ష చేయించుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న వైద్యాధికారులు

'విజయకేతనం'తో నూరుశాతం ఉత్తీర్ణత

పదిలో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు - ప్రజాశక్తితో ప్రధానోపాధ్యాయులు

పక్కా ప్రణాళికతో ముందుకు



ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రయివేటు విద్యాసంస్థలకు దీటుగా పక్కా ప్రణాళికతో ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని బుట్టాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.గంగాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. తమ పాఠశాల నుండి తెలుగు మీడియం విద్యార్థులు 33 మంది, ఇంగ్లీష్ మీడియం నుంచి 33 మంది పరీక్షలు రాయబోతున్నారన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రతిసబ్జెక్టులోనూ విద్యార్థుల అవసరమైన మెళకువలు, సూచనలు, సలహాలు అందిస్తూ ఉత్తీర్ణత సాధించేలా తయారు చేస్తున్నామన్నారు. జిల్లా విద్యాశాఖ సూచించిన 'విజయకేతనం' శిక్షణ తరగతులను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల కోసం ఫిబ్రవరి నుంచి మార్చి 31 వరకు ప్రత్యేక అసైన్‌మెంటులు ఇస్తూ వారినీ తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థుల స్థాయిని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, ఇంటి వద్ద చదివించేలా కృషి చేస్తున్నామన్నారు. పేరెంట్స్ కమిటీ సలహాలు సూచనలు తీసుకుని ముందుకు సాగుతున్నామన్నారు. బాగా చదివే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అత్యధిక మార్కులు సాధించేలా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఏజెన్సీలో రాష్ట్ర స్థాయిలోనే ఈ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ద్వారకాతిరుమల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ బెజవాడ రాణి తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను అన్నివిధాలా సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రతి సబ్జెక్టుపై పట్టుసాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. వారికి పరీక్షలంటే భయం లేకుండా మానసికంగా వారిని సన్నద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం తమ పాఠశాల నుంచి 90 మంది బాలికలు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వారికి సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇస్తున్నామని, ప్రతిరోజు ఉదయం 8.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఐదు నుండి ఆరు గంటల వరకూ, సా యంత్రం ఏడు నుండి పది గంటల వరకు ప్రత్యేక స్టడీ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల విషయంలో సబ్జెక్టుల వారీగా శ్రద్ధ తీసుకుంటున్నామని, ప్రతీవిద్యార్థిని ఉత్తర్ణత సాధించడమే తమ లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ రూపొందించిన 'విజయకేతనం' 40 రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుపరుస్తున్నామని రాణి తెలిపారు. సబ్జెక్ట్ ఉపాధ్యాయులు పరీక్షల్లో తీసుకోవాల్సిన మెళకువలపై విద్యార్థులకు తగుసూచనలు, సలహాలు ఇస్తున్నారని చెప్పారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని గిరిజన ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం 46 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయబోతున్నట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ మార్కులు సాధించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల ఎదుగుదలకు పదో తరగతి ఉత్తీర్ణతే తొలిమెట్టు అని, ఇందులో విజయం సాధించేలా వారికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఐటిడిఎ, విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు అందిస్తూ వారిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతీవిద్యార్థి ఉత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా, పాఠాలు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారన్నారు. విద్యార్థులకు స్టడీ సమయంలో స్నాక్స్ వంటివి అందిస్తున్నామన్నారు.


సాయం అందిస్తున్న వెంకటేశ్వరరావు

కార్యకర్తల సంక్షేమానికి టిడిపి కృషి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టిడిపి పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. తిరుమలదేవీపేటలో ఇటీవల పార్టీ కార్యకర్త అనగాని నాగరాజు తల్లి మృతి చెందడంతో బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలక టిడిపి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, తోట వీరాస్వామి నాయుడు, తోట శ్రీను, కాసగాని వీర్రాజు, మన్యం దుర్గారావు, చిరంజీవి, అబ్బదాసరి పండు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మామిడి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని మండల ఉద్యానవనశాఖాధికారి ఆర్.హేమ తెలిపారు. ఆమె ఈదులగూడెంలోని మామిడి తోటలను పరిశీలించారు. మామిడిలో తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, వాటి నివారణకు ఫిప్రోనిల్ 2ఎంఎల్ లీటరు నీటిలో, ఇమిడాక్రోఫిడ్ 0.5ఎంఎల్ లీటరు నీటిలో, లేదా ధయామిధాక్సాన్ 0.3గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్స్, రైతులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు


మిల్లులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రైస్‌మిల్లులో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలనులోని నాన్ ట్రేడింగ్ రైస్ మిల్లు గాయత్రి ట్రేడర్స్‌పై పౌరసరఫరాల శాఖ అధికారులు, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకూ సాగిన ఈ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిల్వఉన్న రూ.13.78 లక్షల విలువ గల సరుకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులకు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఆర్ఎస్ఎస్.సత్యనారాయణరాజు నాయకత్వం వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి ఎస్.వెంకటేశ్వరరావు వారికి సహకరించారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాయత్రి ట్రేడర్స్‌లో అనధికారికంగా నిత్యావసర వస్తువుల చట్టం అతిక్రమిస్తూ సరుకులు నిల్వ ఉన్నట్లు అధికారులకు సమాచారం అందడంతో మిల్లుపై దాడి చేశారు. ఈ దాడిలో రూ.లక్షా 45 వేల విలువ గల బియ్యాన్ని 50 కేజీల వంతున 162 గన్నీ సంచుల్లో ఉంచినట్లు గుర్తించారు. ఇదేవిధంగా రూ.6.03 లక్షల విలువ గల 33.50 టన్నుల బియ్యం 670 ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ ఉన్నట్లు గుర్తించారు. అలాగే రూ.18 వేల విలువ గల 1.50 టన్నుల చిరు నూకలు, రూ.5.18 లక్షల విలువ గల 25.40 టన్నుల ధాన్యం గుర్తించారు. రేషన్ షాపుల ద్వారా బియ్యం సరఫరాకు ప్రత్యేకించిన రూ.12 వేల విలువగల 600 గన్నీ బ్యాగులు, తూకానికి వినియోగించే ఎలక్ట్రానిక్ కాటాలను స్వాధీనపరుచుకున్నారు. మిల్లు నిర్వాహకులపై కేసు నమోదు చేశామని డిఎస్ఒ తెలిపారు. ఈ దాడుల్లో భీమడోలు సిఎస్‌డిటి ఎ.మాధవరావు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ యుటి.విల్సన్, ఎస్ఐ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు

అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని మండలంలోని మిట్టగూడెంలో పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిట్టగూడెం సమీపంలోని చెరువు వద్ద గుర్తుపట్టలేని స్థితిలో ఓ వ్యక్తి మతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు తొండిపాక గ్రామానికి చెందిన సూదిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(52)గా గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గత కొంతకాలంగా మతిస్థిమితం లేక పోవడంతో కనిపించకుండా పోయినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నాడు.

సిమెంట్ పక్కదారి పట్టిస్తే చర్యలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇంటి నిర్మాణం చేపట్టకుండా అనర్హులకు సిమెంట్ సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని గృహనిర్మాణ శాఖ అధికారి రంగారావు సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలో ఏర్పాటు చేసిన స్టాక్‌పాయింట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి, గృహనిర్మాణం చేపట్టిన వారికి మాత్రమే సిమెంట్ కట్టలు ఇవ్వాలని ఆదేశించారు. కొంతమంది ఇంటి నిర్మాణం చేపట్టకుండా సిమెంట్ కట్టలు కావాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నట్లు తనదృష్టికి వచ్చిందన్నారు. అలాంటి విధానం కరెక్ట్ కాదని వారికి తెలిపారు. గృహ నిర్మాణం చేపట్టిన వారికి మాత్రమే విడతల వారీగా మెటీరియల్ అందిస్తామన్నారు. ఆయనతో పాటు హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.


సిమెంట్ నిల్వలు పరిశీలిస్తున్న రంగారావు

మహిళా సంఘాల ద్వారా ఎండుమిర్చి అమ్మకాలు

ప్రజాశకిత - పోలవరం

మండలంలోని ఐకెపి మహిళా సంఘాల ద్వారా తక్కువ ధరకు నాణ్యమైన ఎండుమిర్చి విక్రయాలు బుధవారం ప్రారంభమయ్యాయి. కొత్తనూతనగూడెం గ్రామ సంఘంలో సిఐజి కమిటీ ద్వారా నాణ్యమైన కల్తీ లేని ఆహార పదార్థాలు ఎస్‌హెచ్‌జి సభ్యులకు, మండలంలోని గ్రామ సంఘాల మహిళలకు, స్థానిక ప్రజలకు తక్కువ ధరకు ఎండు మిర్చి అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని పోలవరం వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం బెజవాడ శ్రీనివాస్, సిసి వెంకటలక్ష్మి సమక్షంలో మిర్చి అమ్మకాలు ప్రారంభించామని సిఐజి కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరావు సూచనలు మేరకు ఉన్నతాధికారుల సలహాతో ఎండుమిర్చి అమ్మకాలు ప్రారంభించామన్నారు. వేలేరుపాడు, భద్రాచలం ప్రాంతాల నుండి సుమారు రూ.15 లక్షల విలువ చేసే ఆరు టన్నుల ఎండుమిర్చి తీసుకువచ్చామన్నారు. మిర్చి కొనుగోలు ధర కేజీ 250 రూపాయలు కాగా ఖర్చులు, లాభం కేవలం 20 రూపాయలు మాత్రమే వేసుకుని కేజీ 270 రూపాయలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. పోలవరంలో నాలుగు ప్రదేశాల్లో మిర్చి బస్తాలు ఉంచి గ్రామ సంఘాల ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు. మిర్చి అమ్మకం అనంతరం ఖర్చులు పోను మిగిలిన సొమ్మును గ్రామ సంఘాల అభివృద్ధికి ఉపయోగించాలని నిర్ణయించామని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్‌హెచ్‌జి సభ్యులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి గంగారత్నం, పాదం విజయలక్ష్మీ, కామిశెట్టి ఆదిలక్ష్మి, కాకర్ల శివకుమారి, గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.


చలివేంద్రం ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

కృష్ణ, మహేష్ యువసేన ఆధ్వర్యాన చలివేంద్రం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


ప్రముఖ నటుడు కృష్ణ పేరుమీద చలివేంద్రం ఏర్పాటు సంతోషకరమని కృష్ణ, మహేష్ యువసేన అధ్యక్షులు బవిరిశెట్టి మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక నూతన మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ మూడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ చలివేంద్రం బాటసారులకు, ప్రయాణికులకు వేసవిలో దాహం తీరుస్తున్నామన్నారు. ప్రతీ గురువారం వారపుసంత సందర్భంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.


సాయం అందించిన వైష్ణవి

అంత్యక్రియలకు వైష్ణవి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

నిరుపేద వ్యక్తి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకుంది అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి. మండలంలోని సంకర్షణపురానికి చెందిన నిరుపేద వృద్ధుడు పులి ఆంజనేయులు(75) బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైష్ణవి తన తండ్రి అంబుల మనోజ్‌తో కలిసి వెళ్లి మృతదేహన్ని సందర్శించి ఆంజలి ఘటించారు. అనంతరం అంత్యక్రియలకు అయ్యే ఖర్చు గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా వైష్ణవి మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన వారెవరైనా అంత్యక్రియాలకు ఇబ్బందిపడితే తనను సంప్రదించాలన్నారు. .


ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో నేతలు

భుజబలపట్నంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

కైకలూరు: మండలంలోని భుజబలపట్నంలో టిడిపి నేతలు బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పి.త్రినాథరాజు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, ఎఎంసి మాజీ ఛైర్మన్ తాడినాడ బాబు, మాజీ సర్పంచి గుజ్జుల రామలక్ష్మి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక షెడ్యూల్ విడుదల

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం న్యాయవాదుల బార్ అసోసియేషన్ 2023-2024 ఎన్నికల షెడ్యూల్ బుధవారం విడుదల చేశారు. ఎన్నికల కమిషనర్లుగా వైఆర్‌కె. పరమహంస, తోట వెంకట సత్యనారాయణ, పీతల సుధాకర్, గుత్తికొండ శ్రీనివాస్ వ్యవహరించనున్నారు. ఈ నెల 15న నామినేషన్లు, 31న ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరిస్తున్న వైఆర్‌కె.పరమహంస తెలిపారు.

మార్చిలోనే మార్కెట్లోకి.. మొగల్తూరు మామిడి

పాలకొల్లు: ఏప్రిల్ తరువాత వచ్చే మామిడి పండ్లు మార్చి మొదట్లోనే మార్కెట్లోకి వచ్చాయి. మొగల్తూరుకు చెందిన మామిడి పండ్లను పాలకొల్లు - నరసాపురం రోడ్డులో కొందరు అమ్ముతున్నారు. అయితే కొన్ని మామిడి చెట్లు జన్యుపరంగా ముందుగా గాని, ఆలస్యంగా గాని కాపుకొస్తాయి. ఈ నేపథ్యంలో కొన్ని చెట్లు ముందుగా కాపు కాయడంతో వాటిని ముగ్గపెట్టి పాలకొల్లు మార్కెట్లో అమ్ముతున్నారు. పరక సైజు బట్టి రూ.250 నుంచి రూ.450 వరకూ అమ్ముతున్నారు.